కథ

మా చిన్న బాబాయి హన్మంతరావును మావూరు వాళ్లే కాక మా తాలూకూ జనాలంతా ''మిలిట్రీ దొరవారూ'' అనే పిలుస్తారు. ఆయన కాక మా నాన్నకు మరో తమ్ముడున్నాడు. ఈయన్ను రంగయ్య దొర అని పిలుస్తారు. మా మిలిట్రీ బాబాయికీ ఒక్క ఆడపిల్లా, ఒక పిల్లవాడు మాత్రమే సంతానం. మా రంగారావు బాబాయి వ్యవసాయపనులూ, లానాదేనా వ్యవహారాలు చేసుకునేవాడు. మా నాన్న తాసిల్దార్లకు, తాలూకాదార్లకు, పోలీసు ఆఫీసర్లకు ఎప్పుడెప్పుడు నజరానాలు పంపాలో, వాళ్లతో ఏమేమి పనులు సాధించాల్సివుందో చూసుకొనేవాడు. మా మిలిట్రీ బాబాయి మాజీ సైన్యాధ్యక్షుడు. జీతగాళ్ళంతా ఆయన అదుపాజ్ఞల్లో ఉండేవారు. మా ఇంటి ముందు నుంచి ఎవడైనా చెప్పులు వేసుకుని వీధిగుండా వెళ్ళాడో వాడు చచ్చాడన్నమాటే. మిలిట్రీ బాబాయి కేకతో మా జీతగాళ్ళు చెప్పులతో వెడుతున్న ఆసామిని పెడరెక్కలు విరిచి లాక్కొచ్చేవాళ్ళు. వాడికి మా మిలిట్రీ బాబాయి జుర్మానా విధించేవాడు. ఆ ఆసామి తాలూకు వాళ్ళు ఎవరో వచ్చి డబ్బు కట్టి అతన్ని విడిపించుకోవాలని. అది డిసిప్లీన్.

# మా మిలిట్రీ బాబాయి

## ఎన్. కె. రామారావు

మేము దేశ్‌ముఖ్‌లం ఏడువూర్లకు దొరలం మా ఆరువేల నియోగులకు కొంత మందికి మాత్రమే దొరతనం వుండేది. ఇదెలా జరిగిదంటే మా మిలిట్రీ బాబాయి చెప్పినదాని సారాంశం. నిజాం నవాబుగారి తాతో, ముత్తాతో ఒకాయన నాసిరుద్దాలా అని వుండేవాడు. ఆయన హయాంలో భూమి శిస్తు వసూళ్ళ హక్కును వేలం వేసేవారు. కొంతమంది నియోగులు కూడా వేలంలో ఆ హక్కు సంపాదించి, నవాబుకు కట్టవల్సిందానికంటే ఎక్కువే వసూలు చేసి ఆ డబ్బుతో సొంత భూములు పెంచుకొనేవారు శిస్తు కట్టలేని వాళ్ళ భూముల్ని కూడా తామే దఖలు పర్చుకునేవారు. దీన్ని ''సర్‌బరస్తా'' పద్ధతనేవాళ్ళు. మా తాతముత్తాతలు అప్పటి తాలూకాద్దార్లకు లంచాలిచ్చీ, దావతులిచ్చీ మూడువేల ఎకరాల భూమీ, దొరతనం సంపాదించుకొన్నారు. అయితే సాలార్‌జంగు అని ఒకాయన నిజాం దగ్గర ప్రధానిగా వచ్చి ఈ వేలం పద్ధతి రద్దుచేశాడు. దానికి బదులుగా, దేఖ్‌ముఖ్ దేశ్‌పాండ్యా, సర్దేశాయి, వంటి బిరుదులిచ్చి మమ్మల్ని కూడా శిస్తు కట్టమన్నాడు.

మా నాన్నకు మా పెద్దబాబాయికి ఉర్దు, తెలుగు, సంస్కృత భాషల్లో పాండిత్యం వుండేది. వేల సంఖ్యలో పద్యాలు ధారణలో వుండేవి. మా మిలిట్రీ బాబాయికి ఇవన్నీ గిట్టవు ఆయన 'డిసిప్లిన్ – క్రమశిక్షణ'' అంటూ అరుస్తుండేవాడు. వూళ్ళో తగాదాలు ఆయన పరిష్కరించాల్సిందే, క్రమశిక్షణ తప్పినవాళ్ళను చెట్టుకు కట్టేసి కొరడాతో కొట్టేవాడు.

ఊరంతా మమ్మల్నీ మా మిలిట్రీ బాబాయిని ''దొరవారూ'' అని సంభోదించేది. పొరపాటున మా బాబాయిని ''హన్మంతరావు సాబ్'' అన్నాడనుకొండి వాడు చచ్చాడన్నమాటే. వాడికి మర్యాద మప్పితాల గురించి పెద్దవుపన్యాసం యిచ్చేవాడు. ''ఏటండీ బ్రిటిషు ఇండియాలో స్వాతంత్రపోరాటం జరిగింది. రాజులు పొయ్యారు రాజ్యాలు పొయ్యినయి. కాలం మారినా కనిపెట్టరేమండి'' అని మా హెడ్మాష్టరు ఒకమారు విసుక్కున్నాడు. దాంతో మా మిలిట్రీ బాబాయి చెలరేగిపొయ్యాడు. ''ఏంటి కాలం మారిందా! ఎక్కడ మారింది సూర్యుడు తూర్పు వైపునే పుడుతున్నాడా? మారాడా? అమావాస్యలు, పౌర్ణాలు మారాయా? ఫుజూల్ మాటలు మాట్లాడకు పంతులూ'' బాబాయి గట్టిగా జవాబిచ్చాడు.

''మా మిలిట్రీ బాబాయికి నైజాం నవాబంటే మహా ఇష్టం, వట్టికోట ఆళ్వారుస్వామి ఎక్కువగా మా ఇంట్లోనే వుండేవాడట, మా నాన్నను పెదమామాయ్యా'' అని పిలిచేవాడట అలాగే మా బాబాయినీ ఎప్పుడూ వచ్చిపోయేవాళ్ళతో మా ఇల్లు కళకళలాడుతుండేదట. చందాల కేశవదాసు మా ఇంట్లో కొన్నాళ్ళువుండి మా నాన్నతో భారత, భాగవత రామాయణాది శాస్త్రపురాణ విషయాలు చర్చించి, హరికథలు వినిపిస్తుండేవాడట ఇలా ప్రతి సంవత్సరమూ జరుగుతుండేదట.

ఆశ్వారుస్వామిలో అప్పుడప్పుడే యాంటీ ఫ్యూడల్ భావాలు పొటమరిస్తుండేవట. మా నాన్నతో ఆయన ఈ విషయాలు ధైర్యంగా మాట్లాడేవాడట. 1938 ఆంధ్రమహాసభల తర్వాత అతివాదులు కమ్యూనిష్టు పార్టీవైపు మొగ్గారట. అలా 1942లో ఆశ్వారుస్వామి కమ్యూనిష్టు పార్టీలో చేరిపోయాడట. మా మిలిట్రీ బాబాయి మట్టుకు ఆశ్వారుస్వామిపట్ల కొంచెం గుర్రుగా వుండేవాడట. పైగా ''ఆశ్వారూ నిజాం అంటే ఎవరనుకున్నావురా? ఆయన రుస్తుమ్-ఎ-దౌరాన్, అరస్తే-ఎ-జమాన్, ముజఫర్-ఉల్-ముల్కు-సిప్పేసాలార్'' అని చెబుతూ తన్మయత్వంలోకి వెళ్లిపోయేవాడట. ఆశ్వారుస్వామి మటుకు దానిమ్మ గింజల్లాంటి పలువరుస కనిపించేలా చిరునవ్వుతో ''నీదంతా చాదస్తంలే మామయ్యా'' అని కొట్టిపారేశేవాడట.

మా మిలిట్రీ బాబాయికి గుండెలవిసిపోయే చారిత్రక సంఘటనొకటి జరిగింది. అది 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం రావటం, హైద్రాబాద్ సంస్థానం తన సొంతమనీ దాన్ని మిగతా భారతదేశంలో విలీనం చెయ్యనని నిజాం పట్టుపట్టాడు. సొంత సంస్థానంలో ఇటు కాంగ్రెస్‌వాళ్లూ, అటు కమ్యూనిష్టులు వుద్యమాలు ఉధృతంచేశారు. నిజాం రజాకారు సేనలు వూళ్ళమీద విరుచుకపడ్డాయి. జాతీయ పతాకం ఎగరేసినవాళ్ళకు నిజాం ఏడాది జైలుశిక్ష వెయ్యిరూపాయల జుర్మానా ప్రకటించాడు. 1947 డిశంబరు 4 సాయంత్రం నిజాం నమాజుకు పోతుంటే నారాయణరావు అనే యువకుడు ఆయన కాన్వాయిమీద బాంబు పేల్చాడు. నిజాం ప్రమాదం నుంచి దైవికంగా బయటపడ్డాడు.

ఈ వార్తలు మా మిలిట్రీ బాబాయికి క్రమశిక్షణారాహిత్యపు ఉన్మాద చర్యలుగా కనిపించేవి కనబడ్డవాళ్ళందరిమీదా కస్సు, బుస్సు లాడేవాడు. టి హయగ్రీవాచారి, సర్దార్ జమలాపురం కేశవరావు, వి.బి.రాజులు బెజవాడ లోనూ, కొండాలక్ష్మణ్ బాపూజీ షోలాపూరులోనూ, కె.వి.నరసింగరావు వగైరాలు చాందాలోనూ శిబిరాలు నడుపుతూ నిజాం వ్యతిరేకవుద్యమాన్ని తీవ్రతరం చేశారు. ఈ పేర్లు వింటే మా మిలిట్రీ బాబాయికి గంగ వెర్రులెత్తేవి, నిజాం రాష్ట్రంలో కాలం గందరగోళాల మధ్యా, తుపాకీ తూటాలమోతల మధ్యా, పోరాటవీరుల మరణాల మధ్యా సాగుతూపోతోంది. తెలంగాణా అంతటా ఒక మృత్యు ఝుంఝు ప్రసరిస్తుండేది. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం నైజాం రాష్ట్రంలో అడుగుపెట్టి పరిస్థితిని ఎదుర్కొంది. సెప్టెంబర్ 18న నైజాం నవాబు లొంగిపోయ్యాడు. ఏ వూళ్ళో ఏ మూల చూసినా మిలిటరీ కేంపులు తుపాకీలు.


నిజాం లొంగిపొయ్యాడనగానే మా మిలిట్రీ బాబాయి పొర్లి పొర్లి ఏడ్చాడు. తన దొరతనానికి కీడు మూడిందని కుమిలిపోసాగాడు. ఈ ఘటనలు జరుగుతున్నప్పుడు మేం ఆంధ్రాలో తలదాల్చుకున్నాం. ఇక్కడ కాశీం రజ్వీమూకలు మమ్మల్ని నమ్మలేదు. మా అస్తిత్వం కోసం మేం చాటుగా కమ్యూనిష్టులకు, కాంగ్రెసువారికి తోడ్పడుతున్నామని అతని భావన ఇక్కడ మా ఆస్తులకు మా ప్రాణాలకు రక్షణలేదు. అందుచేత జగ్గయ్యపేటలో తలదాచుకున్నాం. జానపద సినీహీరో కాంతారావు అతని కుటుంబం మేమూ ఒకే అద్దెకొంప షేరుచేసుకోని ఉన్నాం. భావి సినీ హీరో కాంతారావు కూడా ఈ పోరాటాల్లో పాల్గొన్నాడు. రజాకార్లు అతని బత్తాయి తోటను నరికివేశారు.

రకరకాల ప్రదేశాల్నుంచి వచ్చిన కాందిశీకులను జగ్గయ్యపేట ఇముడ్చుకోలేకపోయింది. కలరా లాంటి అంటు వ్యాధులు ప్రబలాయి. మా నాన్న మా పెద్ద బాబాయిలు రెండు రోజుల తేడాతో కలరాతో మరణించారు. నేను చాలా చిన్నపిల్లవాడిని తెలంగాణాలో పరిస్థితులు కొంచెం ప్రశాంతంగా మారింతర్వాత మా వూరు తిరిగి వచ్చాం.

***

కాలం వేళ్ళ సందులనుంచి నీళ్ళలా జారిపోతున్నది. మా నాన్నగారి సంతానం నేనూ మా తమ్ముడూ, మా పెద్దబాబాయి సంతానం గోపాలరావు స్కూల్లో చేరటానికి హుజూరునగర్ బయలుదేరాం. మా మిలిట్రీ బాబాయి తనకూతురు రాధక్కను, కొడుకు రాజగోపాలును చచ్చినా బడికి పంపనన్నాడు, మా కందిబండ స్కూల్లో చదివింది చాలన్నాడు. దొరవారి పిల్లలకు చదువెందుకని తర్కించాడు. ఆడపిల్లలకు చదువే అఖ్ఖర్లేదని, దొరవారైన తన పిల్లలకు చదువనేదే అఖ్ఖర్లేదని హఠంపట్టాడు. మా రాధక్క తండ్రిని ఖాతరు చేయకుండా మాతో పాటే వచ్చి స్కూల్లో చేరి చదువుకుంది. మా మిలిట్రీ బాబాయికి పరిస్థితులు అర్థం కావటం లేదనే బదులు అతను పెరిగిన వాతావరణం అతని మనస్తత్వం అతనికి మార్పుల్ని మార్పులుగా గుర్తించే విజ్ఞతనివ్వటం లేదనటం సబబు. దళితులు బహుజనుల కుర్రవాళ్ళు స్కూళ్ళల్లో చేరటం అతనికి మింగుడుపడటం లేదు.

కుటుంబ ఆస్తుల పరంగా చూసుకుంటే మేమంతా బాగా దెబ్బతిన్నట్టేలెక్క కౌలుదారులకు యాజమాన్య హక్కులు సంక్రమించటంవల్ల చాలా భూమి కోల్పోవాల్సివచ్చింది. కొంత భూమి కమ్యూనిష్టులు ఏమాత్రం భూమిలేని వాళ్ళకు పంచి ఇచ్చారు. మా మిలిట్రీ బాబాయికీ కోర్టులూ వ్యవహారాలు తెలియవు. మా నాన్నా పెద్ద బాబాయి లేరు. అంచేత నోరు మూసుకొని పరిస్థితులతో రాజీపడవల్సి వచ్చింది. అయినా మాకింకా 800 ఎకరాల మెరక, 50 ఎకరాల మాగాణి మిగిలింది. మా మిలిట్రీ బాబాయి వ్యసాయం చేపట్టాడు. దొరతనం చెక్కుచెదర్లేదు దేశంలో ఎన్ని మార్పులొచ్చినా మా మిలిట్రీ బాబాయిని ''దొరవారూ'' అని ప్రజలు సంభోదిస్తున్నారు.




చాలు ఆ పిలుపు మా బాబాయిని హిందోళరాగంలా వివశుణ్ణి చేస్తుంది. పిలిచిన వాడిమీద ప్రేమ పొంగులు వారుతోంది. ఆ ఆనందంతో ఎదుటి వాడు ఏదడిగినా ఇచ్చేస్తాడు.

కాలం ఒక్కలా సాగదు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు మా బాబాయిని మళ్ళీ కలవర పెట్టింది. స్కూల్లో వుత్సవాలు చూసి రాత్రికి ఇంటికి చేరేసరికి మా బాబాయి హాజరు. మనిషి ఆందోళనగా వున్నాడు. ఏదో లేనిపోనివి వూహిస్తున్నట్టు న్నాడు. సాధారణంగా హుజూరు నగరుకు రాగానే పేకాట స్నేహితుల దగ్గరికెళ్లే ఆయన ఆ రోజు పేకాట క్కూడా పోలేదు. నన్ను పక్కకి లాక్కెళ్ళి గుసగుసగా ''అరేయి రాముడూ, ఈ ఆంధ్రోళ్ళు వస్తే మన దొరతనం దెబ్బతిం టుందంటావా? మన్ని దొరవారూ అని పిల్చే మన జనానికి అలాపిలవొద్దని నేర్పిస్తారంటావా? అనడిగాడు నేను ఇదమిద్ధంగా ఏమీచెప్పలేక తల రెండువైపులా వూపాను. నాకు మటుకు ఏమి తెలుసు? చరిత్ర ఎట్లా మారుతుందో ఆందోళనల మధ్య ముల్కీ నాన్‌ముల్కీ గోబ్యాక్ నినాదాల మధ్య, హైస్కూలు చదువు పూర్తి కావచ్చింది. మా మిలిట్రీ బాబాయి తన కూతురు రాధక్కతో మాటలు మానేశాడు. కావాల్సిన డబ్బు పుస్తకాలకు, బట్టలకు పంపటమే తన విధిగా భావించాడు.

మా వూళ్ళో చాలా మార్పులొచ్చాయి. 1957 తర్వాత పంచాయితీ బోర్డులు వచ్చాయి. సర్పంచులుగా, సభ్యులుగా వివిధ కులాలకు చెందిన వాళ్ళు ఎన్నికవుతున్నారు. మా భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి.

పెళ్ళిళ్ళయినా భూములమ్మటం, చదువులకూ భూములమ్మటం, శుభాశుభకార్యాలకు భూములమ్మటం ఇంట్లో వెనకటి దర్జాను చెక్కు చెదరకుండా వుంచటం కోసం భూములమ్మటం. అప్పుడు మూడు కుటుంబాల వాళ్ళం వేర్లుపడ్డాము. తలా ఒక వందెకరాల మెరకా, మూడెకెరాల మాగాణీ వచ్చాయి. ఎడ్లూ గిడ్లూ అమ్మేశాం. భూములు చెరిసగం పాళ్ళకు రైతులకిచ్చాం. అప్పటికి నాగార్జున సాగర్ కాల్వలు రాలేదు. ఇంకొ రెండేళ్ళకి కాల్వలు వస్తాయంటున్నారు. అప్పుడు గోదావరి జిల్లా నుంచి వెంకట్రామయ్య అనే రైతు వచ్చి మా వూళ్ళో ఎవరు భూమి అమ్ము తానన్నా కోనేయటం మొదలుపెట్టాడు. మా బాబాయికి అతనికి స్నేహం కుదిరింది, ''దొరవారూ ఈ భూముల మీదొచ్చే పంటెంత? అది మీ దర్జాకు ఏం సరిపోతుంది మీరు మెడ్రాసెళ్ళి సినిమా తీయండి. ఎన్టీయార్‌నో, అక్కినేనినో పెట్టి బొమ్మతీయండి లక్షలకు లక్షలొస్తాయని'' వూదరుకొట్టాడు. దాంతో మా బాబాయి మోడ్రాసెళ్ళి సిన్మా మొదలు పెట్టాడు. ఎంత మందిమి వద్దని చెప్పినా వినిపించుకోలేదు. పెద్దయాక్టర్లు దొరక్క దర్శకుడికి అంతో ఇంతో ముట్టచెప్పిన ఒక కొత్త హీరోతో సినిమా తీసి రిలీజ్ చేశాడు. అయిదో రోజు కల్లా బాక్సులు వాపసువచ్చేశాయి.

ఇక్కడ వూళ్లో బాబాయి భూమంతా వెంకట్రామయ్య చేతిల్లోకి వెళ్ళి



పోయింది. సాగరు కాలువల జలాలతో మెరక భూములన్నీ మాగాణు లయ్యాయి. మా బాబాయికి సినిమా ఫీల్డులో ఏ మాత్రం క్రమశిక్షణ కనిపించలేదట. ఇంటి పట్టునే వుంటున్నాడు. మేం మగపిల్లాళ్ళం తెనాలి కొకడూ, ఖమ్మానికొకడు పై చదువుల నిమిత్తం వెళ్లి పోయాం. మా రాధక్కకు పెళ్ళీడు దాటుతోందని మా మిలిట్రీ బాబాయి వాపోతున్నాడట, ఖమ్మం జిల్లాలో ఏదో సంబంధం మాట్లాడుతున్నాడట, ఇంతలో ఘోరం జరిగిపోయింది. స్కూల్ ఫైనల్ పేసయిన మా రాధక్క మా కులం కాని వాడిని పెళ్లాడింది. ఇది మా బాబాయి మీద అశని పాతంలా పరిణమించింది. మా పిన్ని ఏమీ మాట్లాడదు. ఆవిడ స్కూల్ ఆఫ్ థాట్ వేరు. బాబాయి కొన్నాళ్ళు బయటికి రాలేదు.

తరాలు మారుతున్నాయి, మనుషులు వయసు రీత్యా పెద్దవాళ్ళయిపోతున్నారు. మమ్మల్ని ''దొరవారూ'' అని సంభోదించే తరం మారింది. అంతా కొత్తతరం యువకులు వాళ్లు మా మిలిట్రీ బాబాయిని కలవటం దాదాపు మానేశారు. వాళ్ళల్లో కొద్ది మంది మాత్రమే ఆయన్ను దొరవారంటున్నారు. అలా పిలిచేవారి సంఖ్య క్రమేపి తగ్గిపోవటం బాబాయికి చాలా భయం కలిగిస్తున్నది. ఉన్న భూమంతా సినిమా పూడ్చుకపోయింది. మిగిలిన అయిదెకరాలలో కొడుకు పేకాటకని మూడెకరాలు అమ్మేశాడు. తాగుడూ పేకాట వాడిని వున్న వూళ్ళో వుండనియ్యలేదు. ఒక సుమూహర్తాన వూరు వదలి వెళ్లి పోయాడు. చనిపోయాడో, బతికున్నాడో తెలియదు. కష్టం మీద కష్టం పిన్ని గుండెపోటుతో పోయింది. కర్మ కాండలకు ఒక ఎకరం అమ్మి అట్టహాసంగా చేశాడు. ఇంకావొక ఎకవరం మిగిలింది. కూతురును తల్లి శవం చూట్టానికియ్యాడా రానీయలేదు.

అంతా గాఢాంధకారం వెనకటి ఆస్తులూ లేవు. కచ్చడపుబండ్లూ లేదు. ఈ లోపు 1969లో ఒక ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వచ్చింది. మేమంతా ''సమైక్యాంధ్ర'' అంటూ నినదిస్తుంటే బాబాయి మటుకు ప్రత్యేక తెలంగాణాకు ప్రయత్నిస్తున్న వాళ్ళకు సాయపడండిరా అబ్బాయిలు'' అన్నాడు. దేనికి బాబాయి అని ఆశ్యరంగా అడిగితే ''అప్పుడయినా మన దొరతనం మనకొస్తుందేమోరా'' అంటూ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆయన అమాయకత్వానికి నవ్వుకోవాలో ఏడ్చుకోవాలో అర్థం కాలేదు. మేమంతా మంచి వుద్యోగాల్లానే వున్నాం. భూముల్ని అమ్మి పట్నాల్లో ఇళ్ళూ, షాపులు కట్టుకున్నాం. రూపాయ బిళ్ళ వృధా కాకుండా చూసుకుంటూ పిల్లల్ని ఈ కాలపు చదువులు చదివిస్తున్నాం మేమూ రిటైరయ్యాము. మా పిల్లలు సాఫ్టవేర్ రంగంలో లక్షలు సంపాదిస్తున్నారు. ఆర్థిక పరంగా మా జీవితాలు సుఖంగానే వున్నాయి.


బాబాయికి 85వ ఏడు వచ్చింది గుళ్ళో పూజారి కాంతాచార్యులు గారు మడిగా వండి రెండు పూటలా బాబాయికి భోజనానికి లోటురాకుండా చూసుకుంటున్నాడు! ఒకనాడు కొత్త సర్పంచు వచ్చి ''హన్మంతరావుగారూ మీరింకొక పది సంవత్సరాలు బతుకుతారు స్వాతంత్రయోధుల ఫించనకు ధరఖాస్తు పెట్టండి. ఆ ఒక్క ఎకరం అమ్మీ అందులో సగం డబ్బు నాకిచ్చారంటే పైరవీ చేసి ఇప్పిస్తాను'' అన్నాడట కాంతాచార్యులు ఫోనుచేసి చెప్పాడు. బాబాయికి కోపం నసాళానికంటిందట. వెధవ మర్యాదలేకుండా పేరుపెట్టి పిలిచాడు ''ఏ స్వాతంత్ర పోరాటం? నేనేళ్ళ చేసిన? బతికిన్నాళ్లు ఆ అలాహజ్రత్‌ను తల్చుకుంట కళ్లు మూస్తా చలే జావ్'' అన్నాడట ఎందరో దొంగపింఛన్లు తీసుకుంటుంటే ఈయనకేం మాయరోగం నాకూ బాబాయిమీద కొంచెం కోపం వచ్చింది.

అయిపోయింది. మిలిట్రీ బాబాయికి కిందెట్టు మీదెట్టుగా వుందని ఆచారిగారు ఫోన్ చేశారు. అంతా మావూరు వెళ్లిపోయాం. బాబాయి బాగా ఆయాసపడి పోతున్నాడు, మాట సరిగ్గా-కాదు-కష్టంగా వస్తున్నది. అర్థం అయి కాకుండా వుంది. ఇంకొ గంటో రెండు గంటలో అన్నట్లుగా వుంది అందరినీ గది బయటికి వెళ్ళమనీ నన్ను దగ్గరగా పిలిచి వీపు నిమురుతూ ''అబ్బాయి ఇంకొక ఎకరం వుంది నా ప్రాణం మహా అయితే ఇంకో గంటవుంటుందేమో నా ఆఖరి కోరికతీరుస్తావా'' ఆయాసంగా చెప్పాడు. కన్నీళ్ళు తుడుచుకుంటూ ''అలాగే బాబాయి'' అన్నాను.

''నా ఆఖరి క్షణంలోనయినా నన్ను ఎవరైనా దొరవారూ అని పిలిస్తే అర ఎకరం వాడికివ్వడానికి సిద్ధంరా! మిగతా అరెకరం అమ్మి రాధమ్మ కొడుకు – నా మనమడికి ఆ డబ్బిచ్చేయి ''ఎగపోత మొదలైంది ముందు నివ్వెరపోయాను'' దొరవారూ అని పిలవమని ఎవరి కాళ్ళు పట్టుకోను? బజారులో పిచ్చిగా నడవసాగాను అంతా అయోమయం నా ముందు అంతా చీకటి ఆ చీకటిలో సన్నటి వెలుగు రేఖ టి.వి. తెరలాంటి ఒకానొక కల్పిత యవనిక మీద నా చిన్ననాటి సంగతులు కనబడసాగాయి. బాబాయి కచ్చడం తోలుతున్నాడు ముందు వెట్టివాడు పరుగుతీస్తున్నాడు. స్థంభాని కట్టేసి జీతగాడిని కొడుతున్నారు. వాడి పెళ్లాంపిల్లలు హృదయ విదారకంగా రోదిస్తున్నారు దృశ్యం మారింది. మా బంగాళాలేవి? మా కొట్టాలేవి? మా భూములెక్కడ? మా బావులెక్కడ? ఏవి తల్లీ నిరుడుకురిసిన హిమ సమూహములు ఆలోచిస్తూ నడుస్తున్న నాకు ఎవరో పరిగెత్తుకొచ్చి 'మీ బాబాయి చనిపోయారని' చెప్పాడు. అయ్యో ఆయన ఆఖరి కోరిక తీరలేదు. శవయాత్ర ఏర్పాట్లు చేస్తున్నాప్పుడు ఎప్పుడొచ్చాడో ఎలా వచ్చాడో తెలియదు బాబాయి ఈడు వాడైన పత్తిపాటి లింగారెడ్డి ''దొరవారూ నన్నొదిలి వెళ్లిపోయారా''? అంటూ వెక్కి వెక్కి ఏడుస్తుండగా బాబాయి శవాన్ని మావూరు శ్మశానానికి చేర్చాం. ఎంతమంది దొరల్ని, ఎంతమంది కర్షకుల్ని, కూలి వాళ్ళను తన కడుపులో దాచుకుందో తెలియదు. ఆదే శ్మశానంలో మా మిలిట్రీ బాబాయి బూడిదయ్యాడు. బాబాయి తత్వాన్ని నేను ''బాబాయితనం'' ''బాబాయిజం'' అని పేరుపెట్టుకున్నాను. వెధవది ఈ మధ్య ఈ సాఫ్ట్‌వేర్ డబ్బుతోనూ, రియల్ ఎస్టేటు డబ్బుతోనూ, నాలో ''బాబాయిజం'' పెరుగుతోందనిపిస్తోంది.

*

## ప్రమాదకరమైన ఆట!



'జానేతూ యా జానేనా' విజయం తర్వాత అమీర్ ఖాన్ మేనల్లుడు ఇమ్రాన్ ఖాన్ పెద్ద స్టార్ అయిపోయాడు. ఇప్పుడు తన లవర్ బాయ్ ఇమేజ్‌కి భిన్నంగా 'కిడ్నాప్' అనే యాక్షన్ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రం కోసం ప్రస్తుతం తన సన్నని శరీరాన్ని కండలతో అలంకరించేందుకు నానా తంటాలు పడుతున్నాడు. ఇందులో సంజయ్ దత్ కూడా నటిస్తున్నాడు. సంజయ్ దత్ కూతురైన మినిస్సా లాంబాను 'కిడ్నాప్' చేసే కిడ్నాపర్ పాత్రలో ఇమ్రాన్ ఖాన్ నటిస్తున్నాడు. ఇందులో ఒక సన్నివేశంలో మినిస్సా లాంబా చేతిని బల్లపై పరచి ఆమె వేళ్ళ మధ్య కత్తిని పదే పదే పొడిచే సన్నివేశం ఒకటి ఉంది. వేళ్ళకు తగలకుండా మధ్య ఖాళీల్లోనే ఇలా పొడవాలి. దర్శకుడు సంజయ్ గంధ్వీ క్లోజప్ షాట్ కాబట్టి నకిలీ కత్తి ఉపయోగించడానికి వీల్లేదన్నాడు. అయితే ఇమ్రాన్ ఖాన్ మొదటి ప్రయత్నంలోనే మినిస్సా వేళ్ళ మధ్య నుండి చక చకా కత్తి పొడుస్తూ షాట్ ఒకే చేసేసాడు. మినిస్సాతో సహా యూనిట్ అంతా ఆశ్చర్యపోయారు. కత్తితో తనకు ఇంత ప్రావీణ్యం ఎలా వచ్చిందన్న విషయంపై మాట్లాడుతూ, ''నేను చిన్నప్పుడు బోర్డింగ్ స్కూల్లో ఈ ఆట ఆడేవాణ్ణి. నాపైనే ఈ ప్రయోగం చేసుకునే వాణ్ణి. చూడండి ఇప్పటికీ నా చేతి వేళ్ళ నిండా గాయాల మచ్చలున్నాయి,'' అని చేతిని కూడా ఋజువుగా చూపిస్తున్నాడు ఇమ్రాన్. కత్తులతో ఇదేం చెలగాటం అని యూనిట్ అంతా ఆశ్చర్యపోయిందట!